ఆపదలో మేమున్నామంటూ..

- అండగా నిలుస్తున్న స్నేహితులు
- ఓపెన్ ఐస్ సొసైటీ ద్వారా సేవలు
- పేదలు, విద్యార్థులకు సైతం సహకారం



ఓపెన్ ఐస్ సొసైటీ సభ్యులు

హుజూర్‌నగర్ : స్నేహమంటే సంతోషాలను మాత్రమే పంచుకోవడం కాదు.. ఆపదొస్తే అండగా నిలబడి భరోసానివ్వాలని సంకల్పించారు హుజూర్‌నగర్‌కు చెందిన కొందరు యువ స్నేహితులు. పదిమంది స్నేహితులు కలిసి ఓపెన్ ఐస్ సొసైటీ అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి తమ మిత్రుల్లో ఎవరికి ఆపదొచ్చినా చేయూతనందిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సులువ శ్రీను 2017లో తనతో పాటు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీఈడీ చదివిన మిత్రులు రవీందర్, ఉపేందర్, జాకీర్ హుస్సేన్, స్వాతి, అంజలి, కృష్ణ, లక్ష్మణ్, శివశంకర్, మజీద్, చందుతో కలిసి ఈ స్వచ్ఛంద సేవా సంస్థను నెలకొల్పారు. సొసైటీలోని ప్రతి సభ్యుడు నాటి నుంచి ప్రతి నెల కొంత నగదును సొసైటీలో జమ చేస్తూ వస్తున్నారు. తమతో కలిసి వచ్చే మిత్రులను సైతం ఈ సొసైటీలో చేర్చుకుంటూ వస్తున్నారు. ప్రస్తుతం ఈ సొసైటీలో 180 మంది సభ్యులు ఉన్నారు. వీరంతా గత 8 ఏళ్లుగా తమ మిత్రులను, పేదలను ఆర్థికంగా, వివిధ రకాలుగా ఆదుకుంటున్నారు. అంతే కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నోట్ బుక్స్, పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలు, బ్లూ టూత్ స్పీకర్లు, టై, బెల్టులు అందజేస్తున్నారు.

సేవా కార్యక్రమాల్లో కొన్ని..

- సొసైటీ సభ్యుల స్నేహితుడు బైక్ మెకానిక్ వెంకన్న మరణించగా, అతని కుటుంబానికి రూ.3.10 లక్షల ఆర్థికసాయం ఇచ్చారు.
- మరణించిన మిత్రుడు వీస మధు కుటుంబానికి రూ.లక్ష ఆర్థికసాయం అందించారు.
- రోడ్డు ప్రమాదంలో మరణించిన టీచర్ కమలాకుమారి కుటుంబానికి రూ.1.13 లక్షల ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు.
- అనారోగ్యంతో బాధపడుతున్న డిగ్రీ మిత్రుడు చైరు వెంకయ్యకు రూ.1లక్ష ఆర్థికసాయం ఇచ్చి చేయూతనందించారు.



మిత్రుడి కుటుంబానికి ఆర్థిసాయం అందజేస్తున్న ఓపెన్ ఐస్ సొసైటీ సభ్యులు

- అనారోగ్యంతో బాధపడుతున్న బీఈడీ క్లాస్‌మేట్ అరుణ్‌కుమార్‌కి రూ.50 వేల సహాయం చేశారు.
- పదో తరగతి మిత్రుడు చాగంటి విజయ్‌బాబుకు రూ.36 వేల ఆర్థికసాయం అందజేశారు.

క్లుప్తంగా

పందెం కోడికి శస్త్రచికిత్స

కోదాడరూరల్ : పందెం కోడికి పశువైద్యుడు శస్త్ర చికిత్స చేసి దాని ప్రాణాలు కాపాడాడు. కోదాడ పట్టణంలో పందెం జాతి కోళ్లను పెంచే పెద్దోజు శిధర్‌కు చెందిన ఓ కోడికి పొట్టభాగంలో గడ్డ ఏర్పడడంతో అది ఇబ్బందులు పడుతోంది. దీంతో పందెం కోడిని ఆయన కోదాడ పట్టణ ప్రాంతీయ పశువైద్యశాలకు తీసుకురాగా డాక్టర్ పి.పెంటయ్య కోడిని పరీక్షించి పొట్టభాగంలో కండరాలు బయటకు వచ్చి గడ్డలాగా మారాయని నిర్ధారించారు. శస్త్రచికిత్స నిర్వహించి గడ్డను తొలగించి పొట్టభాగాన్ని యథాస్థితికి తీసుకొచ్చి దాని ప్రాణాలు కాపాడారు. సిబ్బంది చంద్రకళ, అఖిల్ పాల్గొన్నారు.

సేవా రంగంలో లయన్స్ క్లబ్‌కు ప్రత్యేక స్థానం



సీతారాంరెడ్డికి సభ్యత్వం అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : సేవా రంగంలో లయన్స్ క్లబ్‌కు ప్రత్యేక స్థానం ఉందని నేరేడుచర్ల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గుండ్రెడ్డి సైదిరెడ్డి అన్నారు. శనివారం నేరేడుచర్లలో లయన్స్‌క్లబ్ 2025–26 నూతన సభ్యత్వం నమోదును ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా చార్టెడ్ ప్రెసిడెంట్, డిస్ట్రిక్ చైర్మన్ కొణతం సీతారాంరెడ్డికి సభ్యత్వం అందజేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ చైర్మన్ చల్లా ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి యూసుఫ్, సభ్యులు శ్రీను, వెంకట్‌రెడ్డి, కోటేశ్వర్‌రావు, బాల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక ఆదాయం

నడిగూడెం : ఆయిల్ పామ్ సాగుతో అధిక ఆదాయం పొందవచ్చని పతంజలి ఆయిల్ కంపెనీ కోదాడ డివిజన్ ఫీల్డ్ ఆఫీసర్ వెంకట్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని నల్లపాటి శ్రీనివాసరావు వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ పామ్ మొక్కలు నాటడాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆయిల్ పామ్ తోటలలో అంతర పంట సాగు చేసు చేసుకుంటూ అదనపు ఆదాయం కూడా పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రైతు నల్లపాటి శ్రీనివాసరావు, పతంజలి ఫీల్డ్ అసిస్టెంట్ తొండల నరేష్, రైతులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి.. నలుగురిపై కేసు నమోదు

నడిగూడెం : మండల పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన మారిశెట్టి నర్సింహారావు శనివారం గ్రామ సమీపాన తన పొలం దున్నుతుండగా అదే గ్రామానికి చెందిన కుంటిగొర్ల స్వాతి, తన సోదరుడు గోపి, మరో ఇద్దరు తనపై రాయితో దాడి చేశారని బాధితుడు నడిగూడెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జి.అజయ్‌కుమార్ తెలిపారు.

ఎక్కడైనా పింఛన్ తీసుకునే వెసులుబాటు కల్పించాలి

హుజూర్‌నగర్ : దివ్యాంగులు రాష్ట్రంలో ఎక్కడైనా పింఛన్ తీసుకునే వెసులుబాటు కల్పించాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం పట్టణ గౌరవ సలహాదారు ఆకుల రాము కోరారు. శనివారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన దివ్యాంగుల సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ జిల్లాలో పెన్షన్ మంజూరైతే వారికి ఆ జిల్లాలోనే పెన్షన్ ఇచ్చే విధానం అమలులో ఉందని తెలిపారు. బతుకు తెరువు కోసం దూరప్రాంతాలకు వెళ్లిన వారికి, వివాహాలై అత్తగారింటికి వెళ్లిన వారికి, ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి ఫింఛన్ తీసుకోవటం ఇబ్బందికరంగా మారిందని తెలిపారు. పాలకులు, అధికారులు ఆలోచించి దివ్యాంగులకు ఆన్‌లైన్ పద్ధతిలో రాష్ట్రంలో ఎక్కడైనా పింఛన్ ఇచ్చే విధానాన్ని అమలు చేయాలని కోరారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు వీరాంజనేయులు, ఆశోదు, శ్రీను, రామకృష్ణ, వీరాంజి, కొండలు తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి

నేరేడుచర్ల : దుకాణ నిర్వాహకులు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని మున్సిపల్ వార్డు అధికారి జి.శ్రీనివాస్‌రావు అన్నారు. నేరేడుచర్ల మున్సిపాలిటీలోని 14వ వార్డులో శనివారం నిర్వహించిన వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలు ఎక్కడపడితే అక్కడ చెత్త వేయవద్దని అన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనం వచ్చినప్పుడు వేయాలని సూచించారు. మెప్మా ఆర్‌పీలు సర్వే చేపట్టి నల్లా కనక్షన్లు ఆన్‌లైన్ కాని ఇళ్లను గుర్తించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది, స్థానికులు ఉన్నారు.

సమన్వయంతోనే లక్ష్యసాధన : ఎస్పీ



మోతె పోలీస్ స్టేషన్‌లో రిజిస్టర్ తనిఖీ చేస్తున్న ఎస్పీ నరసింహ

మోతె : పోలీసులు సమన్వయంతో పనిచేస్తేనే లక్ష్యాన్ని చేరుకుంటారని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ అన్నారు. శనివారం మోతె మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆయన అకస్మీకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ డైరీ, రిసెప్షన్ రిజిస్టర్ తనిఖీ చేశారు. మండలంలో నేరాలు, ఫిర్యాదులు, కేసుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. కేసుల విషయంలో పారదర్శకంగా, వేగవంతంగా దర్యాప్తు జరిపి బాధితులకు న్యాయం చేయాలన్నారు. స్టేషన్‌లో కేసులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. గ్రామ రిజిస్టర్లు, హిస్టరీ షీట్స్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. బ్లూ కోట్ విధులు, పెట్రోలింగ్ విధులు వంటివి ప్రధానమైనవన్నారు. ఆయన వెంట ఎస్సై అజయ్‌కుమార్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

పెన్షన్ కోసం వృద్ధురాలి పాట్లు



పింఛన్ కోసం కుర్చీ సహాయంతో నడిచి వెళ్తున్న గోపి జానమ్మ

మేళ్లచెరువు : మండల కేంద్రానికి చెందిన 85 ఏళ్ల వృద్ధురాలు గోపి జానమ్మ ప్రతినెలా పింఛన్ డబ్బులు తీసుకోవడానికి వెళ్లేందుకు పాట్లు పడుతోంది. నడవలేని స్థితిలో ఉన్న ఆమె ప్రతినెలా కుర్చీ సహాయంతో సుమారు అర కిలోమీటరు ఇబ్బందులు పడుతూ వెళ్లి పెన్షన్ డబ్బులు తీసుకుంటోంది. తనకంటూ ఎవరూ లేకపోవడంతో ఎక్కడికి వెళ్లాలన్నా ఇలా కుర్చీని ఆసరాగా చేసుకుంటోంది. ఇలాంటి వృద్ధుల కోసమైనా ప్రభుత్వం ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ ఇచ్చే ఏర్పాట్లు చేయాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ప్రజాపాలనలో ప్రజల వద్దకే పథకాలు



లబ్ధిరులకు రేషన్‌కార్డులు అందజేస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ జాయింట్ సెక్రెటరీ అజీజ్ పాషా, మాజీ కౌన్సిలర్ అట్లూరి మంజుల హరిబాబు అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని 19 వార్డులో ప్రభుత్వం నుంచి మంజూరైన ఆహార భద్రత కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాపాలనలో ప్రజల వద్దకే సంక్షేమ పథకాలు వస్తాయని అన్నారు. మండలానికి 3 వేల నూతన రేషన్ కార్డులు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జక్కుల మల్లయ్య, బి.వెంకటనారాయణ, ఎస్.సుబ్బరాజు, కె.మట్టయ్య, బి.గోవిందరావు, ఎం.సత్యనారాయణ, పి.రామ్మూర్తి, సీహెచ్.శ్రీనివాస్, జి.శివ, ముస్తఫా, మోహిన్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రైతులకు అండగా బీజేపీ

పాలకవీడు : దేశంలోని రైతులకు బీజేపీ ప్రభుత్వం అండగా నిలుస్తోందని, వారి సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు నరినాయక్ అన్నారు. పీఎం కిసాన్ శనివారం గుడుగుంట్లపాలెం గ్రామంలోని రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమ్మాన్ నిధి యోజన పథకం నిధుల విడుదల, ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగాన్ని రైతులతో కలిసి వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రీకాంత్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

తల్లిపాలు.. బిడ్డకు అమృతంతో సమానం



హుజూర్‌నగర్ : తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న సూపర్‌వైజర్ సోమమ్మ

హుజూర్‌నగర్ : తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సోమమ్మ అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని 2వ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తప్పనిసరిగా పట్టాలని చెప్పారు. తల్లి పాలలో రోగనిరోధక శక్తి అధికంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ పద్మ, పీహెచ్‌ఎన్ నూర్జహాన్, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు

తల్లిపాలే బిడ్డకు మేలు

గరిడేపల్లి : తల్లిపాలే బిడ్డకు ఎంతో మేలని, బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టిస్తే బిడ్డలో రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ టీచర్ పోకల వెంకమ్మ తెలిపారు. శనివారం మండలంలోని గానుగబండ గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన కోడెదూడ గోశాలకు తరలింపు

కోదాడరూరల్ : మండల పరిధిలోని గుడిబండలో వధించేందుకు తీసుకొచ్చిన కోడెదూడను కోదాడ రూరల్ పోలీసులు గోశాలకు తరలించారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడిబండలోని ఎస్.వెంకటరత్నం ఇంటికి ఇస్మాయిల్ అనే వ్యక్తి కోడెదూడను తీసుకొచ్చి వధించేందుకు సిద్ధం చేశాడు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకొని కోడెదూడను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విచారణ అనంతరం ఇద్దరిపై కేసు నమోదు చేసి దూడను గోశాలకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నడిగూడెం : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సిరిపురం బ్రాంచి మేనేజర్ దినేష్‌కుమార్ అన్నారు. నడిగూడెం మండల పరిధిలోని వల్లాపురం గ్రామానికి చెందిన వట్టికూటి రమేష్ వల్లాపురం నుంచి శ్రీరంగాపురం వెళ్లే రోడ్డులో పార్ బాయిల్డ్ రైస్ మిల్ నిర్మించుకునేందుకు గాను కేంద్ర ప్రభుత్వం పథకమైన అగ్రికల్చర్ ఇన్‌ఫ్రా ఫండ్ కింద మంజూరు చేసిన రూ.2 కోట్ల రుణం మంజూరు పత్రాన్ని శనివారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ మణికంఠ, క్యాషియర్ కార్తీక్, ఎఫ్ఓఎస్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



రమేష్‌కు రూ.2 కోట్ల రుణం మంజూరు పత్రం అందజేస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ దినేష్‌కుమార్

మట్టపల్లిలో నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని శనివారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీసామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం చేపట్టారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, పంచగవ్య, ప్రాశనమధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో కల్యాణ వేడుక జరిపారు. అనంతరం గరుడ వాహనంపై స్వామి అమ్మవార్లను ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

నడిగూడెం : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పల్లె దవాఖానా వైద్యాధికారి డాక్టర్ హరినాథ్ సూచించారు. శనివారం నడిగూడెం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో సీజనల్ వ్యాధులపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి వెంకటరమణ, ఆరోగ్య విస్తరణాధికారి చంద్రశేఖర్ రాజు, హెల్త్ అసిస్టెంట్ కృష్ణమూర్తి, ఏఎన్‌ఎం సుజాత, ఆశా కార్యకర్త సునీత, ఉపాధ్యాయులు సుజాత, విజయ, సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశ్రమల కార్మికులకు రూ.26 వేలు వేతనమివ్వాలి

మేళ్లచెరువు : సిమెంట్ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, సిమెంట్ క్లస్టర్ వర్కర్స్ యూనియన్ కన్వీనర్ వట్టెపు సైదులు డిమాండ్ చేశారు. శనివారం చింతలపాలెం మండలంలోని దొండపాడు పరిధిలో గల జువారి సిమెంట్ పరిశ్రమ లోడింగ్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేళ్లచెరువు మండలం రామాపురంలో ఈ నెల 6వ తేదీన నిర్వహించబోయే యూనియన్ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుగుణంగా లేబర్ చట్టాలను తీసుకొచ్చి కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో కార్మికులు శౌరీ, ఇంటి తిరుపతయ్య, నాగయ్య, జయరాజ్, గురవయ్య, వీరయ్య, వెంకటేశ్వర్లు, నాగరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తేజ ఫార్మసీ కళాశాలలో సిగ్నేచర్ డే

కోదాడ: పట్టణ పరిధిలోని తేజ ఫార్మసీ కళాశాలలో శనివారం బీఫార్మసి నాలుగవ సంవత్సరం విద్యార్థులు సిగ్నేచర్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ పందిరి నాగిరెడ్డి కేక్ కట్ చేసి మాట్లాడారు. అనంతరం విద్యార్థుల సంతకాలు, ఫొటోలతో రూపొందించిన టీషర్టులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ విద్యాసంస్థల సీఈఓ ఎస్.ఎస్.రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, కళాశాల నిర్వాహకులు

హ్యాపీ ఫ్రెండ్ షిప్ డే



కోదాడ : పట్టణ పరిధిలోని తేజ టాలెంట్ స్కూల్‌లో శనివారం విద్యార్థులు ముందస్తుగా స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకొని శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యం

- కోదాడ ఎమ్మెల్యే పద్మావతి



ప్రభుత్వ వైద్యశాలలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

కోదాడ : పట్టణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యమని కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి అన్నారు. శనివారం కోదాడ ప్రభుత్వ వైద్యశాలలో రూ.12 లక్షల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. కోదాడ పట్టణ ప్రజలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న 100 పడకల వైద్యశాల పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. దీని కోసం ప్రభుత్వం రూ.26 కోట్లు ఖర్చు చేస్తుందని చెప్పారు. త్వరలోనే వైద్యశాలలో సిటీ స్కాన్ సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు. వైద్యశాలలో వైద్యుల కొరత ఉన్నమాట వాస్తవమేనని, వారంరోజుల్లో ఇద్దరు గైనకాలజిస్టుల నియామకం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ దశరధ, డీసీహెచ్‌ఎస్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ సూర్యానారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవేటి రామారావు, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, ఈదుల కృష్ణయ్య, రామినేని శ్రీనివాసరావు, కందుల కోటేశ్వరరావు, కమదం చందర్‌రావు, యాతాకుల మధుబాబు, ముస్తఫా, లైటింగ్ ప్రసాద్, విద్యుత్‌శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో పూజలు



ముత్యాలమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పద్మావతి, తదితరులు

కోదాడ : ముత్యాలమ్మ అమ్మవారి దీవెనలతో నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే నలమాద పత్మావతి ఆకాంక్షించారు. శనివారం కోదాడ ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో ముత్యాలమ్మ అమ్మవారికి ఆమె పూజలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రజలు ఆదివారం ముత్యాలమ్మ జాతర, బోనాల పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. ప్రజలందరికీ ముందస్తుగా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ దశరథ, ఈదుల కృష్ణయ్య, రామినేని శ్రీనివాసరావు, డాక్టర్ బ్రహ్మం, పైడిమర్రి వెంకటనారాయణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

సాగులో శాస్త్రీయ పద్ధతులు పాటించాలి

- జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి



మాట్లాడుతున్నజిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి

గరిడేపల్లి : సాగులో రైతులు నూతన శాస్త్రీయ పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి జి.శ్రీధర్‌రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో 20వ విడత పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం నగదు బదిలీ ప్రత్యేక వీక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశ జనాభా రోజురోజుకి పెరుగుతుందని దీనిని దృష్టిలో పెట్టుకొని ఆహార భద్రతపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించిందని, దీనిలో భాగంగానే రైతులకు అనేక స్కీమ్‌లను, సబ్సిడీలను అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులు కేవలం ఒకే పంటపై ఆధారపడకుండా సమగ్ర వ్యవసాయ విధానంలో సాగు చేపట్టాలన్నారు. వరితో పాటు కూరగాయలు, పండ్ల తోటల సాగు, పెరటి కోళ్లు, పశువులు, చేపల పెంపకంతో అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త కేవీకే ఇంచార్జి డి.నరేష్, కేవీకే శాస్త్రవేత్తలు సీహెచ్.నరేష్, కిరణ్, మాధురి, ఆదర్శ్, అక్షిత్, సుగంధి, కంప్యూటర్ ప్రోగ్రామర్ నరేష్, మండల వ్యవసాయ అధికారి ప్రీతమ్‌కుమార్, ఇఫ్కో కంపెనీ ఏరియా మేనేజర్ వెంకటేశ్వర్లు, రైతులు, డీలర్లు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు విద్యార్థులు కష్టపడాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వీరవల్లి శ్రీలత, నాగేశ్వర్‌రావు

గరిడేపల్లి : విద్యార్థులకు లక్ష్యసాధనకు కష్టపడి చదవాలని మోటివేషనల్ స్పీకర్లు వీరవల్లి శ్రీలత, సరికొప్పుల నాగేశ్వరరావు సూచించారు. శనివారం గరిడేపల్లి మండల పరిధిలోని రాయినిగూడెం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేరేడుచర్ల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సైదిరెడ్డి ఆధ్వర్యంలో యువ వికాస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎటువంటి చెడు వ్యసనాలకు లోనుకాకుండా జీవితంలో ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలువల్లో నీరు పారక రైతులకు తిప్పలు



మునగాల : కొక్కిరేణి వద్ద ఎల్-30 కాలువలో కంపచెట్లను తొలగిస్తున్న రైతులు



మఠంపల్లి : వేములూరు కాలువను శుభ్రం చేయిస్తున్న రైతులు, నాయకులు

మునగాల : మండలంలోని కొక్కిరేణిలో గల ఎల్–30, 31 ఎత్తిపోతల పథకాల కాలువలు అధ్వానంగా తయారయ్యాయి. కంపచెట్లు, పిచ్చిచెట్లతో నిండిపోయి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. ప్రస్తుత సీజన్‌కు గాను ఎత్తిపోతల పథకాలకు సాగు నీరు విడుదల చేయడంతో చివరి భూములకు సరిగా నీరు అందడం లేదు. దీంతో గత్యంతరం లేక చివరి ఆయకట్టుకు చెందిన రైతులే కాలువలో ఉన్న చెట్లు, చెత్తచెదారాన్ని తొలగించే కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఇప్పటికైనా సాగు నీటి అధికార యంత్రాంగం స్పందించి కాలువలను శుభ్రం చేసి సాగునీరు సక్రమంగా అందేవిధంగా చర్యలు చేపట్టాలని ఎత్తిపోతల పథకం చైర్మన్ మేదరమెట్ల వెంకటేశ్వరరావు కోరారు.

సొంత ఖర్చుతో గుర్రపుడెక్క తొలగింపు

మఠంపల్లి : మండలంలోని మంచ్యాతండా వద్ద గల వేములూరు ఎడమ కాలువలో కంపచెట్లు దట్టంగా పెరిగాయి. చెత్త, నాచు, పేరుకుపోయింది. కాలువలో గుర్రెపుడెక్క అల్లుకుపోయింది. దీంతో కాలువ చివరి భూములకు సాగు నీరు సరిగా అందడం లేదు. శనివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకుడు మాలోతు బాబునాయక్ సొంత ఖర్చుతో జేసీబీ సహాయంతో కాలువను చెత్త, నాచు, కంపచెట్లను తొలగించారు. ఈ సందర్భంగా బాబునాయక్‌ను ప్రజాప్రతినిధులు, రైతులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ భూక్యా రాయసెల్, మాజీ సర్పంచ్ కిషన్‌నాయక్, మాజీ ఉపసర్పంచ్ చంద్రునాయక్, నాయకులు గంగ్యా, నాగేశ్వరరావునాయక్, రాజా, కోటా, సైదా, నీటిపారుదల శాఖ సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, లస్కర్ కోటాలు, రైతులు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న దాతలు

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో శనివారం కోదాడ పట్టణానికి చెందిన న్యూస్ ఛానల్ రిపోర్టర్ తోటపల్లి నాగరాజు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ వేమూరి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు తోట శ్రీను, ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్లు చెరుకుపల్లి శ్రీకాంత్, చీమ చంద్రశేఖర్, ఏపూరి సునీల్, బండ్ల దాస్, కొమ్ము వెంకటేష్, ఆశ్రమ వ్యవస్థాపకురాలు నాగిరెడ్డి విజయమ్మ, కోఆర్డినేటర్ వాచేపల్లి జ్యోతి, శ్రీకాంత్ పాల్గొన్నారు.